

నిత్యాన్నదానానికి విరాళం


అన్నవరం: కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన బోను నాగమణి సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి, గోసంరక్షణ ట్రస్ట్‌కు శనివారం రూ.రెండు లక్షల విరాళం సమర్పించారు. ఆమెకు అన్నదానం, గోసంరక్షణ బాండ్లను సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ అందచేశారు.



వృద్ధురాలి సజీవ దహనం

పెద్దాపురం రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు అగ్ని ప్రమాదంలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. చుట్ట వెలిగించి వదిలేయడమే ప్రమాదానికి కారణమని అధికారులు తేల్చారు. 8లో

1.18 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 1,18,355 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,500 క్యూసెక్కుల నీరు వదిలారు.

పశు గణనకు మరోసారి బ్రేక్

- డిజిటల్ విధానంలో మార్పులతో అంతరాయం
- మరో వారంలో మొదలుకానున్న ప్రక్రియ
- ఈసారి వీధి కుక్కలు సహా లెక్కింపు

రాజమహేంద్రవరం రూరల్: అఖిల భారత పశుగణనకు బాలారిష్టాలు నెలకొన్నాయి. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారమే గణన ప్రారంభం కావాల్సి ఉంది. డిజిటల్ విధానంలో మార్పుల వల్ల మరోసారి ఈ కార్యక్రమం వాయిదా పడింది. ఐదేళ్లకు ఒకసారి డిపార్టుమెంట్ ఆఫ్ యానిమల్ హస్బెండ్రీ, డెయిరీయింగ్ అండ్ ఫిషరీస్ (డీఏహెచ్‌డీఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పశుగణనను వాస్తవానికి ఈ ఏడాది సెప్టెంబరు ఒకటో తేదీ నుంచే ప్రారంభించాల్సి ఉంది. ఉత్తర ఈశాన్య రాష్ట్రాలు సన్నద్ధంగా లేనందున దాదాపు రెండు నెలలు ఆలస్యంగా ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రారంభించాల్సి ఉండగా మరో వారం పాటు ఆలస్యం కానుంది. డిజిటల్ విధానంలో పశుగణన చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి ఎన్యూమరేటర్లకు పశుగణన యాప్‌కు పశు సంవర్ధక శాఖ అధికారులు ఐడీ, పాస్‌వర్డ్‌లు రూపొందించారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. ఐడి, పాస్‌వర్డ్‌లు కేటాయిస్తే తప్ప పశుగణన చేపట్టడం వీలుకాదు.

ఆంగ్లేయుల కాలం నుంచే..

భారతదేశంలో పశుగణనను ఆంగ్లేయుల పాలనా కాలం నుంచి అంటే 1919 నుంచే నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ 20 పశుగణన (లైవ్‌స్టాక్ సెన్సెస్)లు పూర్తయ్యాయి. 21వ పశుగణన మరో వారం వాయిదా పడింది. వ్యవసాయ, మత్స్యరంగం, అటవీ రంగాల్లోని మొత్తం ఆదాయంలో లైవ్‌స్టాక్ ఆదాయం 25.6 శాతం ఉంటుందని అంచనా. జీడీపీలో లైవ్‌స్టాక్ సెక్టారు భాగస్వామ్యం నాలుగు శాతంపైగానే ఉంటోంది. అందుకు కీలకమైన పశుగణనను ఎప్పటికప్పుడు చేపడుతున్నారు.

వీధుల్లో సంచరించే జంతువులతో సహా..

ఆవులు, గేదెలతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, పెంపుడు జంతువులతో సహా అన్ని జంతు జాలాలను వయసు, లింగంతో సహా ఈ గణనకు పరిగణన లోనికి తీసుకుంటారు. ఈసారి వీధుల్లో సంచరించే కుక్కలు, ఇతర జంతువులనూ లెక్కించనున్నారు. వీటితో పాటు రైతులు వాడే యంత్ర పరికరాలు, గడ్డి కత్తిరించే, గడ్డి కట్టలు కట్టే మెషీన్ల వంటి పరికరాలతో పాటు, పాలు పితికే యంత్రాలతో సహా వివరాలను సేకరించనున్నారు. పశువుల సంతలు, పశువుల నీటి తొట్టెలు, పశు దాణా తయారీ కేంద్రాలు, పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాలు, కోడిమాంసం / మాంసం దుకాణాలు, జంతువుల మార్కెటింగ్ వంటి వివరాలు నమోదు చేయనున్నట్టు సమాచారం. గతంలో రెవెన్యూ శాఖ ఈ గణనను చేపట్టేది. అయితే లోటుపాట్లు లేకుండా సర్వే జరగాలనే ఉద్దేశంతో 2007 నుంచి ఈ గణనను ప్రభుత్వం పశుసంవర్ధక శాఖకు అప్పగించింది.

కలెక్టర్ ఆధ్వర్యంలోనే..

జిల్లాస్థాయిలో పశుగణన అధికారిగా కలెక్టర్, డివిజన్ స్థాయిలో పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ / అసిస్టెంట్ డైరెక్టర్, మండల స్థాయిలో పశువైద్యాధికారి సర్వే అధికారిగా ఉంటారు. ఎన్యూమరేటర్లుగా గోపాలమిత్రలు, వెటర్నరీ పారా సిబ్బంది 255 మంది పశుగణాల లెక్కింపులో పాల్గొంటారు. పూర్తి ఆధునిక సాంకేతికతతో వెబ్, మొబైల్ యాప్‌లో వివరాలు సేకరించనున్నారు. 39 మంది సూపర్‌వైజర్లు ఈ గణనలో పనిచేస్తున్నారు.



పశుగణన సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి(ఫైల్)

20వ పశుగణన ప్రకారం జిల్లాలో జీవాలు ఇలా

ఆవులు	74,778
గేదెలు	1,93,847
గొర్రెలు	1,71,263
మేకలు	69,265
పందులు	2,080
పౌల్ట్రీ కోళ్లు	2,13,75,656

పక్కాగా పశు గణన

జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన సర్వే పక్కాగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. జిల్లాలోని 5.63 లక్షల ఇళ్లలో పశుగణన చేయనున్నారు. ఎన్యూమరేటర్లకు పశుగణన యాప్ ఐడీ, పాస్‌వర్డ్‌లు క్రియేట్ చేశాం. కేంద్ర ప్రభుత్వం వీటిని ఆమోదించాల్సి ఉంది. నవంబరు ఒకటి నుంచి పూర్తి స్థాయిలో పశుగణన సర్వే ప్రారంభమవుతుంది.

–డాక్టర్ టి.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, తూర్పుగోదావరి

సందు సందుకూ మందు!

- జోరందుకున్న బెల్ట్ షాపుల ఏర్పాట్లు
- పక్కా ప్రణాళికతో సిండికేట్ల కార్యాచరణ
- వీలైనన్ని గ్రామాలకు విస్తరించేలా చర్యలు
- మిలాఖత్ అయిన కూటమి నేతలు
- ఎమ్మార్పీకి మించి విక్రయాలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం నేతృత్వంలోని మద్యం సిండికేట్ మరింతగా బరితెగిస్తోంది. ఇప్పటికే వ్యాపారులను బెదిరించి, భయపెట్టి షాపుల్లో వాటాలు దక్కించుకున్న మాఫియా అదనపు ఆదాయం కోసం అడ్డదారులు తొక్కుతోంది. సిండికేట్ హస్తగతం చేసుకున్న మద్యం దుకాణాలకు అనుగుణంగా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగా బెల్టు షాపుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మద్యం సిండికేట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా ఎక్కడికక్కడ బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. అనధికారిక షాపుల నిర్వహణకు వేలం పాటలు వేసి మరీ ఎవరు ఎక్కడ విక్రయించాలో సిండికేటే నిర్ధారిస్తోంది. ఒక్కో బెల్ట్ షాపునకు డిపాజిట్‌గా ఆ ప్రాంతం, వ్యాపారాన్ని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇంకా పూర్తి స్థాయిలో లైసెన్స్ షాపులు ఏర్పాటు కాకముందే గ్రామాల్లో బెల్టు షాపుల్లో అనధికారిక మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే రూ.10 నుంచి రూ.20 అధికంగా విక్రయించవచ్చని బెల్ట్ షాపుల నిర్వాహకులకు మద్యం వ్యాపారులు భరోసా ఇస్తున్నారు. మద్యం దుకాణాలు లేని ప్రధాన కూడళ్లలో, మారుమూల గ్రామాల్లో షాపులు తెరుస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. దుకాణాలు లేని శివారు ప్రాంతాలకు సైతం మద్యం సరఫరా చేస్తున్నారు.

మద్యం దుకాణానికి అనుబంధంగా..

జిల్లా వ్యాప్తంగా 125 మద్యం షాపులకు నిర్వహణకు అబ్కారీ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సింహభాగం దుకాణాలు ఇప్పటికే కొలువుదీరాయి. ఆయా దుకాణాలకు అనుబంధంగా ఒక్కో దుకాణం పరిధిలో కనీసం 100 బెల్ట్ షాపులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నారు. ఎవరు ఎక్కడ పెట్టుకోవాలి? ఒక్కో బెల్ట్ షాపు నిర్వహణకు ఎంత డిపాజిట్ చెల్లించాలి? అబ్కారీ శాఖకు ప్రతి నెలా ఎంత ముట్టజెప్పాలి? అన్న విషయాలపై సిండికేట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మరీ వ్యాపారులు, బెల్ట్ దుకాణాల నిర్వాహకులకు దిశానిర్దేశం చేసింది. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా ఇప్పటికే బెల్ట్ షాపు ప్రారంభించేశారు. ప్రస్తుతం మద్యం దుకాణాల వ్యాపారులకు అబ్కారీ శాఖ నుంచి పర్మినెంట్ లైసెన్స్ అందలేదు. అదీ జారీ చేసిన వెంటనే వ్యాపారం మరింత విస్తృతం కానుంది.



నిడదవోలు నియోజకవర్గంలోని ఓ బెల్ట్ షాపులో విక్రయానికి సిద్ధం చేసిన మద్యం

కళ్లు మూసుకున్న అబ్కారీ శాఖ

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలుస్తున్నా, పర్మిట్ రూమ్‌లలో మద్యం విక్రయాలు జరుగుతున్నా అబ్కారీ అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా మద్యం అక్రమ విక్రయాలు సాగుతున్నా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైన్ షాపులు, బెల్ట్ షాపుల నుంచి నెలవారి మామూళ్లు ఫిక్స్ చేసుకున్న అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. క్షేత్రస్థాయి అధికారులు వ్యాపారులతో మిలాఖత్ అయ్యారు. నెలకు తమకు ఇంత ముట్టజెప్పాలని ఇప్పటికే ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా.. బెల్ట్ షాపులు ఏర్పాటవుతున్నా.. అబ్కారీ శాఖ గ్రామాల్లో పర్యటించిన పాపాన పోలేదు. దాడులు చేసిన దాఖలాలు లేవు. జిల్లా స్థాయి ఉన్నతాధికారి సైతం కేవలం కార్యాలయానికే పరిమితమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో సైతం బెల్ట్ షాపులు వెలిశాయి. అనధికారికంగా మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నాయి.

- కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో కొవ్వూరు పట్టణం, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మూడు మండలాల పరిధిలో ఇప్పటికే 200లకు పైగా బెల్ట్ షాపులు అందుబాటులోకి రాగా.. మరిన్ని ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.
- నిడదవోలు నియోజకవర్గం పరిధిలోని నిడదవోలు పట్టణం, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లోని ప్రతి గ్రామంలో బెల్ట్ దుకాణాలు ప్రారంభమయ్యాయి. సుమారు 200కు పైగా బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. మరిన్ని ఏర్పాటుకు సిండికేట్ సమాలోచనలు చేస్తోంది. నిడదవోలు పాటి మీద అనధికారికంగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నట్టు సమాచారం.
- గోపాలపురం నియోజకవర్గంలో 300లకు పైగా ప్రాంతాల్లో మద్యం అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది. ప్రతి గ్రామంలో రెండు దుకాణాలు నడుస్తున్నాయి. భవిష్యత్తులో ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది.
- రాజమహేంద్రవరం సిటీ, రూరల్, అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో సైతం ఇదే తంతు సాగుతోంది. వందల సంఖ్యలో బెల్ట్ దుకాణాల ద్వారా అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు

మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లకు అబ్కారీ శాఖ అనుమతులు ఇవ్వలేదు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాలు అందుబాటులో ఉంచుతూ అక్కడే కూర్చొని తాగేందుకు అవకాశం కల్పిస్తున్నారు. బెల్ట్ షాపుల వద్ద సైతం ఇవే సెట్టింగ్‌లు ఉంటున్నాయి. కస్టమర్లను ఆకర్షించేందుకు బార్ అండ్ రెస్టారెంట్ల తరహా సౌకర్యాలు కల్పిస్తున్నారు.



న్యూస్‌రీల్

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని బిల్లు వసూలు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కె.తిలక్ కుమార్ తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేంద్రాలతో పాటు ఏపీ ఈపీ డీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా బిల్లులు చెల్లించే అవకాశం ఉందన్నారు.

రేపు ఉచిత వినికిడి యంత్రాలకు నమోదు

రాజమహేంద్రవరం రూరల్: వినికిడి సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు, పెద్దలకు రాజమహేంద్రవరం సర్వజన సామాన్య ఆసుపత్రిలో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో ఉచితంగా వినికిడి యంత్రాలు పంపిణీకి నమోదు కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ద్వారా ఈ యంత్రాల పంపిణీ చేపడుతున్నట్టు తెలిపారు. వినికిడి యంత్రాల నమోదుకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, గతంలో వినికిడి పరీక్షలు చేయించుకున్న రిపోర్టులు తీసుకుని సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు రావాలని తెలిపారు. వివరాలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం 0883–2941087 ఫోన్ నెంబరును సంప్రదించాలని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు కోరారు.

ఇసుకను అందుబాటులో ఉంచండి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు సూచించారు. జిల్లాను ప్రగతిపథంలో నడపడంలో ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన అవసరమని అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్ తదితరులతో జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు.

అధికారంలోకి వచ్చింది దోచుకోవడానికా?



అర్ధరాత్రి రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

- కూటమి నాయకులపై వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి ధ్వజం
- భూపాలపట్నంలో అర్ధరాత్రి మట్టి అక్రమ రవాణా అడ్డగింత
- రోడ్డుపై బైఠాయించి నిరసన

రాజానగరం: ప్రజలు అధికారం ఇచ్చినది దోచుకోవడానికన్నట్టు కూటమి పాలకుల తీరు ఉందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మండిపడ్డారు. వీరి దోపిడీకి మేము సైతం అన్నట్టుగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని ఆమె ఆరోపించారు. మండలంలోని భూపాలపట్నంలో మట్టి అక్రమ రవాణాను శుక్రవారం అర్ధరాత్రి తన అనుయాయులతో వెళ్లి ఆమె అడ్డుకున్నారు. నర్సరీలకు ఉపయోగపడే మట్టిని కడియం మండలంలో వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇలా తరలిస్తున్న ఎనిమిది టిప్పర్లను అడ్డుకుని సుమారు మూడు గంటలపాటు రోడ్డుపైనే బైఠాయించారు. ఈ విషయమై ఫోన్‌లో ఫిర్యాదు చేసినా తహసీల్దారు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యకం చేశారు. మా జీతాలు మాకు వస్తున్నాయి కదా.. ప్రజలు ఏమైపోతే మాకేంటి అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. సంక్షేమ పాలనను కాదని, ఇంకేదో జరుగుతుందనే ఆశతో ప్రజలు 'కూటమి' పార్టీలకు పట్టం కడితే వారు దోపిడీకి తెగబడుతున్నారన్నారు.


నియోజకవర్గంలో కుంటుపడిన అభివృద్ధి

గడచిన నాలుగు నెలలలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సైతం పూర్తి చేయలేని అసమర్థ పాలన నడుస్తోందని విజయలక్ష్మి ఎద్దేవా చేశారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని చెప్పే వ్యక్తి స్థాపించిన పార్టీ అభ్యర్థిగా గెలిచిన స్థానిక ఎమ్మెల్యే తన దోపిడీని ఎవరైనా ప్రశ్నిస్తుంటే వారిపై దౌర్జన్యాలు చేయించడం, బెదిరించడం చేస్తున్నారన్నారు. మద్యం దుకాణాలలో వాటాలు ఇవ్వకుంటే జన సైనికులే అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. ఇందుకు సీతానగరంలో జరిగిన సంఘటలను ఆమె ఉదహరించారు. ఇక పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు 'సూపర్ సిక్స్' పేరుతో మద్యాన్ని సరఫరా చేసి చేతులు దులుపేసుకున్నారని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంతం దుర్గారావు, తోరాటి సోమరాజు, మరుకుర్తి వెంకటేశ్వర్రావు, రత్నారావు, రాజు, సూరిబాబు, కోడికోట, అడపా అనిల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆధ్యాత్మిక యాత్రలు

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పుణ్య క్షేత్ర సందర్శనతో శ్రీకారం
- మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించాలన్న ఉద్దేశంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒకరోజు ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం రాజమహేంద్రవరంలోని సరస్వతి ఘాట్ టూరిజం కార్యాలయం వద్ద ఆయన ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2025 మార్చి నాటికి ప్రస్తుత టూరిజం పాలసీ ముగుస్తుందని ఏప్రిల్ 2025 నుంచి కొత్త టూరిజం పాలసీ అమల్లోకి తీసుకొస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. టూరిజం శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అటవీ, దేవదాయ శాఖ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకునేలా ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైనట్టు దుర్గేష్ తెలిపారు. ఋషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా సర్టిఫికెట్ పొందిందని దానితో పాటు కాకినాడ బీచ్, సూర్యలంక బీచ్, రామాపురం బీచ్, నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్‌లు బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పుణ్యక్షేత్ర దర్శిని బస్సును ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

కుటుంబ తగాదాలపై టీడీపీకి అంత ఆసక్తి ఎందుకో?

మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చాగల్లు: తనకు చెందని ఆస్తి కోసం చంద్రబాబు అండ్‌కోతో షర్మిళ చేతులు కలిపిందని, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జైలుకు పంపేందుకు ప్రయత్నిస్తుందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. షర్మిళ అత్యాశతో అహంకార పూరితంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కుటుంబ తగాదాలపై టీడీపీకి అంత ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు. చాగల్లులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన సోదరి షర్మిళమ్మ రాసిన లేఖను జై టీడీపీ అఫీషియల్ ఎక్స్ హ్యాండిల్లో బిగ్ బ్లాస్ట్ అంటూ పోస్ట్ చేసి, నాణేనికి ఒకవైపే చూపించి ప్రజలను పక్కదోవ పట్టించడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని చంద్రబాబు, ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను షర్మిళ చదువుతున్నారన్నారు. సరస్వతి పవర్ షేర్ల అంశం హైకోర్టులో ఉందని, ఆ కేసులు పరిష్కారమయ్యే వరకూ షేర్ల బదలాయింపు జరగదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరస్వతి పవర్ ప్రాజెక్టు కోసం రైతుల నుంచి చట్ట ప్రకారం భూములు కొన్నారని, దీనిని ఎల్లో మీడియా వక్రీకరించడం సమంజసం కాదని అన్నారు. ఆనాడు సోనియా గాంధీతో కుమ్మక్కైన చంద్రబాబు వైఎస్ జగన్‌పై తప్పుడు కేసులు బనాయించారని, ఫలితంగా జగన్ ఆస్తులు సీబీఐ, ఈడీ అటాచ్‌లో ఉన్నాయన్నారు. అసలు చంద్రబాబు ఏనాడైనా తన ఆస్తులను తమ్ముళ్లు, చెల్లెమ్మలకు రాసిచ్చారా అని నిలదీశారు. చంద్రబాబు తన ఉనికి కోసం సొంత తమ్ముడు రామ్మూర్తినాయుడిని ఎదగకుండా చేశాడని విమర్శించారు.

పట్టుకున్నారు.. వదిలేశారు!

- చేతులు మారిన భారీ తాయిలాలు
- ఇసుక దందాలో ఎన్నో లీలలు

ఆత్రేయపురం: అవును.. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామంలో ఇసుక లారీని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆత్రేయపురం బస్టాండ్‌కు తీసుకువచ్చారు. తర్వాత వదిలేశారని సమాచారం. లారీని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసేందుకు ఆత్రేయపురం తరలించారు. కాగా రాత్రికి రాత్రి పెద్ద మొత్తంలో అధికారులకు సదరు లారీ యాజమాన్యం ముట్టజెప్పడంతో లారీని వదిలేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లకు మాత్రమే రేవులోంచి ఇసుకను తీసుకు వెళ్లడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిని తొలుత సిరీయస్‌గా తీసుకున్న అధికారులు జేబులు తడవగానే మెత్తబడి లారీని పట్టుకోలేదు. అసలు లారీ ఏంటి అంటూ చెప్పుకొచ్చారు. మరి రాత్రి బొబ్బర్లంక నుంచి తీసుకువచ్చి ఆత్రేయపురం సెంటర్‌లో ఉన్న లారీ పొద్దున్నకు మాయం కావడానికి కారణాలు రెవెన్యూ, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులకే తెలియాలి. ఆత్రేయపురం మండలంలో గౌతమీ, వశిష్ట గోదావరిలో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. గౌతమీ వశిష్ట గోదావరిలో బొబ్బర్లంక, పేరవరం, రాజవరం, పులిదిండి, కట్టుంగ తదితర గ్రామాల్లో రాత్రి వేళల్లో ఇసుకాసురులు భారీ వాహనాలతో ఇసుకను తరలించుకు పోతున్నారు. వాటిని నియంత్రించాల్సిన రెవెన్యూ ఇరిగేషన్, హెడ్‌వర్క్స్, పోలీస్ అధికారులు ఉత్తుత్తి దాడులు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. కాగా శుక్రవారం రాత్రి బొబ్బర్లంక గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక లారీని అధికారులు పట్టుకున్నారు. దానిని బొబ్బర్లంక నుంచి మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామానికి తరలించారు. అనంతరం ఇసుకాసురులతో అధికారులు కుమ్మక్కై వాహనాన్ని వదిలేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ టి.రాజేశ్వరరావును వివరణ కోరగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న లారీ

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

కిర్లంపూడి: అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలో కృష్ణవరం గ్రామానికి చెందిన అరిపి సత్తిబాబు (31) రెండేళ్ల కిందట కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 2 లక్షలు అప్పు చేశాడు. మృతుడికి ఎడమ కాలు అంగ వైకల్యంతో బాధపడుతున్నాడు. ఆటో నడుపుకొంటూ తన భార్య, ఎనిమిదేళ్ల కుమార్తెను పోషించుకుంటున్నాడు. అప్పులు తీర్చలేకపోతున్నాననే మానసిక వేదనతో ఈ నెల 21న మధ్యాహ్నం గ్రామ శివారు కొబ్బరి తోటలోకి వెళ్లి గడ్డి మందు తాగాడు. అనంతరం తన స్నేహితుడు కాసిన బాబీకి ఫోన్ చేసి జరిగిన విషయం తెలిపాడు. దీంతో మృతుడు అన్నయ్య ఆంజనేయుడు, బాబీ అక్కడకు చేరుకుని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం వద్ద వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నుంచి మురారి వైపు వెళ్తున్న ఐసర్ వ్యాన్ తూర్పుగానుగూడెం శివారులో జంక్షన్ వద్ద తిరిగి రాజమహేంద్రవరం వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటుండగా, అదే సమయంలో మురారి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. కారు ముందు భాగం తునాతునకలై డ్రైవింగ్ చేస్తున్న తొండంగి మండలం, వలసపాకల అగ్రహారానికి చెందిన నట్టే వెంకటరమణ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన అతను రాజమహేంద్రవరంలో జరిగే ఒక శుభకార్యానికి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసును ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలను శనివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ ఉత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి శిష్య బృందం ఆధ్వర్యంలో చేపట్టారు. పుట్ట మట్టితో ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.సత్యనారాయణరాజు పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి. నవకలశ, పంచామృత సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తులు, పవిత్రాలు, పూజా ద్రవ్యాలను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకు వచ్చి పవిత్రోత్సవాలను జరిపించారు.



బాలాజీ స్వామికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

వ్యవసాయ అధికారులుగా పదోన్నతి

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులకు మండల వ్యవసాయ అధికారులుగా పదోన్నతులు ఇస్తూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేణుమాధవ రావు తెలిపారు. సీతానగరం మండలంలో పనిచేస్తున్న పీవీ శ్రీనివాస్‌కు పెద్దాపురం సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా, ఆలమూరు మండలంలో పనిచేస్తున్న కిశోర్‌బాబుకు తాడేపల్లిగూడెం పురుగు మందుల ప్రయోగశాలకు, కపిలేశ్వరపురం మండలంలో పనిచేస్తున్న ఐ.లక్ష్మిని కాకినాడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయాధికారిగా నియమించారు. శనివారం వీరు బాధ్యతలు స్వీకరించారు.

వృద్ధురాలి సజీవ దహనం

పెద్దాపురం: స్థానిక రాజీవ్ కాలనీలో ఓ వృద్ధురాలు పూరి గుడిసెలో చిక్కుకుని సజీవ దహనం అయ్యింది. పెద్దాపురం అగ్నిమాపకాధికారి జగన్నాథం, ఎస్ఐ మౌనిక కథనం ప్రకారం.. స్థానిక శివారు రాజీవ్ కాలనీలో పూరి గుడిసెలో కనకాల బూరమ్మ (75) ఉంటోంది. శనివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె చుట్టను వెలిగించి నిర్లక్ష్యంగా ఉండడం కారణంగానే పూరి గుడిసెకు నిప్పంటుకోవడంతో పాటు ఆమె గుడిసెలో ఇరుక్కుపోయింది. ఆమె మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.



బూరమ్మ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ కోసం క్యూ కట్టిన విద్యార్థులు

నల్లజర్ల: దూబచర్ల గాంధీకాలనీలోని న్యూ లైఫ్ హైస్కూల్‌లో 15 మంది హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం వీరిని ప్రత్యేక వాహనంలో వార్డెన్ రవిరాజు నల్లజర్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. వారికి ఒళ్లంతా ఎలర్జీలు, కళ్ల కలకతో ఉన్నారు. ఆహారం లేక నీరు కలుషితం అయ్యిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఇక్కడ పదో తరగతి వరకూ చదువుతూ హాస్టల్‌లో ఉండే బాలబాలికలు మొత్తం 190 మంది వరకూ ఉన్నారు. తమకు తరచూ ఇదే విధంగా చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయని విద్యార్థులు పూర్ణచందు, రిషి, అఖిల్, పృథ్వీ, విశ్వతేజ తదితరులు వివరించారు. డాక్టర్ గంగాధరరావు వారందరికీ చికిత్స చేసి మందులు ఇచ్చి పంపారు. ఆ హాస్టల్ విద్యార్థులకు తరచూ ఇదే విధమైన రుగ్మతలు వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శాంతిప్రియ హాస్టల్‌ను పరిశీలించారు. తాగు నీరు, టాయిలెట్లు, వంట గది, ఆహార పదార్థాలను చూశారు. దీనిపై కరస్పాండెంట్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇటీవలే హాస్టల్‌కు తిరిగి వచ్చారని, జనరల్ చెకప్‌లో భాగంగానే విద్యార్థులను ఆసుపత్రికి పంపామన్నారు. ఎటువంటి రుగ్మతలు లేవని వివరణ ఇచ్చారు.